
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 24 । జూలై । 2023



ప్రత్యేకాధికారుల నియామకం
గోదావరి ప్రభావిత మండలాల్లో వరద సహాయక చర్యల పర్యవేక్షణకు కలెక్టర్ ప్రత్యేకాధికారులను నియమించారు. 8లో



సేవలు సరళతరం..
ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. 8లో

గరిష్టం / కనిష్టం
27° / 24°

వాతావరణం
జిల్లాలో సోమవారం అక్కడక్కడా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

సహనాన్ని పరీక్షించొద్దు
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని


దీక్షలో కూర్చున్న సాంబశివరావు తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నారని, కార్మికుల ఉద్యమాన్ని నిర్లక్ష్యం చేస్తూ, వారి సహనాన్ని పరీక్షించొద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. 18 రోజులుగా సమ్మె జరుగుతుంటే ప్రభుత్వానికి పట్టడం లేదని ఆరోపించారు. కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కే సాబీర్‌పాషా, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

జేఈ రాతపరీక్ష
సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 14 జేఈ(ఈఅండ్‌ఎం) ఇంటర్నల్ పోస్టుల భర్తీకి ఆదివారం రాతపరీక్ష నిర్వహించగా 10 మంది అభ్యర్థులు హాజరైనట్లు సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య తెలిపారు. సింగరేణి ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించిన రాత పరీక్షను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు.

తొమ్మిదేళ్లయినా ‘డబుల్’ ఇళ్లు పూర్తికాలేదు
బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్


మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రంలోని పాత కొత్తగూడెంలో చేపట్టిన డబుల్ ఇళ్ల నిర్మాణం తొమ్మిదేళ్లు గడిచినా పూర్తికాలేదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేర్రా కామేష్ విమర్శించారు. ఆదివారం ఆయన పాతకొత్తగూడెంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు 9 ఏళ్ల క్రితం సుమారు 830 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టారని, కానీ ఇప్పటి వరకు 100 ఇళ్లు కూడా కట్టలేదన్నారు. అసలు నిర్మాణమే పూర్తికాని ఇళ్లకు లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికార పార్టీ నాయకులు లక్షల రూపాయలు వసూళ్లు చేశారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్నాయనే ఒకే ఒక కారణంతో పేదలకు ఇళ్లు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే వనమా హడావిడి చేశారని అన్నారు. మేదరబస్తీలోని రైల్వే నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని రెండేళ్ల క్రితం హామీ ఇచ్చి, చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్‌రావు, జిల్లా కార్యదర్శి చెనిగారపు నిరంజన్‌కుమార్, గుడివాడ రాజేందర్, జర్పుల కళ్యాణ్, గూగులోత్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

దోబూచులాడుతున్న గోదావరి

- ఉదయం 7 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- సాయంత్రం 42 అడుగులకు తగ్గడంతో ఉపసంహరణ
- వరద ప్రవాహాన్ని కచ్చితంగా అంచనా వేయలేకపోతున్న అధికారులు

భద్రాచలంటౌన్: ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితో భద్రాచలం వద్ద గోదావరి తగ్గుతూ, పెరుగుతూ దోబూచులాడుతోంది. గోదావరి వరద ఉధృతి శనివారం సాయంత్రం వరకు నెమ్మదిగా తగ్గింది. రాత్రి వేళ నుంచి పెరుగుతూ వచ్చింది. అధికారుల అంచనాలకు అందని విధంగా ఆదివారం ఉదయం 7 గంటలకు నీటిమట్టం 43.40 అడుగులకు చేరింది. దీంతో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక మొదటి ప్రమాదక హెచ్చరిక జారీ చేసి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. భద్రాచలం వద్ద 9 లక్షల 51 వేల 120 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వరద ప్రవాహం మరికొంత పెరిగే అవకాశం ఉండటంతో ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఇంతవరకు బాగానే ఉన్న ఉదయం 10 గంటల తర్వాత అధికారుల అంచనాలను తారుమారు చేస్తూ గోదావరి నీటిమటం మళ్లీ తగ్గుముఖం పట్టింది. సుమారు రెండు గంటలపాటు నిలకడగా ఉండి తర్వాత తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి నీటిమట్టం 42 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. ఎగువ ప్రాంతాల నుంచే వరద ప్రవాహంపై అధికారులకు పూర్తిస్థాయిలో అంచనా, సమాచారం లేకపోవడంతోనే గందరగోళానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. కానీ జిల్లా అధికారులు మాత్రం ప్రజలను అప్రమత్తం చేస్తూనే ఉన్నారు. ఎగువన ఉన్న ప్రాజెక్ట్‌ల్లో భారీగా వరద నీరు ఉందని, ఏ క్షణమైనా గోదావరి మళ్లీ పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. దీంతో భద్రాచలానికి దిగువన ఉన్న గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా భద్రాచలం వద్ద నీటిమట్టం ఆధారంగానే ఏపీలోని రాజమండ్రి వరకు ఉన్న మండలాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తారు.

ఆదివారం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం(అడుగుల్లో)..

ఉదయం 7 గంటలకు :	43.01
ఉదయం 10 గంటలకు :	43.60
ఉదయం 11 గంటలకు :	43.50
మధ్యాహ్నం 12 గంటలకు :	43.40
మధ్యాహ్నం 1 గంటకు :	43.20
మధ్యాహ్నం 2 గంటలకు :	43.00
రాత్రి 8 గంటలకు :	42.40
రాత్రి 10 గంటలకు :	42.20


భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి

జలకళ..

- నిండుకుండలా కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్టులు
- ఇప్పటికే అలుగుపోస్తున్న 499 చెరువులు
- వాగులూ వంకల వద్ద జాగ్రత్తలు తప్పనిసరి



402 అడుగులకు చేరిన కిన్నెరసాని రిజర్వాయర్ నీటిమట్టం

పాల్వంచరూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని జలాశయాలు, చెరువులు నిండుతున్నాయి. కొన్ని పూర్తిగా నిండి అలుగు పోస్తున్నాయి. జిల్లా మొత్తం 2,364 చెరువులు ఉన్నాయి. వీటిల్లో 499 చెరువులు నిండి అలుగు పడ్డాయి. 757 చెరువులు 75శాతం నిండగా, 590 చెరువులు 50శాతం, 206 చెరువులు 25శాతం నిండాయి.

తొణికిసలాడుతున్న జలాశయాలు
జిల్లాలో తాలిపేరు, కిన్నెరసాని, పెదవాగు, మూకమామిడి ప్రాజెక్టులు ఉన్నాయి. తాలిపేరు ప్రాజెక్ట్ కింద 24,700 ఎకరాల ఆయకట్టు సాగవుతుండగా, కిన్నెరసాని ప్రాజెక్ట్ కింద 10 వేల ఎకరాలు, పెదవాగు ప్రాజెక్ట్ కింద 16 వేల ఆయకట్టు సాగవుతోంది. తాలిపేరు పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా ప్రస్తుతం 72.50 మీటర్ల వద్ద క్రమబద్ధీకరిస్తున్నారు. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని ప్రాజెక్టు ఆదివారం 402.20 అడుగులకు చేరింది. 1000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులు కాగా, ఆదివారం 10 అడుగులకు చేరింది.

పొంచి ఉన్న ప్రమాదాలు
కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, బావులు నీటితో నిండి జలకళ సంతరించుకున్నాయి. సరదా కోసం ఈతకు వెళ్లితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం లేకపోలేదు. కిన్నెరసాని, ముర్రేడు వాగులు, గోదావరి నదిలో సుడిగుండాలు కూడా ప్రమాదాలకు నెలవుగా మారాయి. సెలవు రోజుల్లో పిల్లలను చెరువులు, కుంటలు, వాగులు వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

గతంలో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే..
- పాల్వంచ మండలంలోని రంగాపురం వద్ద బ్రిడ్జి వద్ద ఇద్దరు చిన్నారులు ఈతకు వెళ్లి సుడిగుండంలో పడి మృత్యువాతపడ్డారు. నాగారం గ్రామం వద్ద కూడా ఓ యువకుడు సుడిగుండంలో పడి మృతి చెందాడు. సూరారం, పాండురంగాపురం గ్రామాల మధ్య కిన్నెరసాని వాగులో పడి పలువురు చనిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి.
- కిన్నెరసాని ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో దిగువన స్నానం చేస్తున్న ఏడుగురు ఇంజనీరింగ్, ఎంబీఏ చదివిన విద్యార్థులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృత్యువాతపడ్డారు. ఈ ఘటన 1999లో జరిగింది.
- రెండేళ్ల క్రితం కిన్నెరసాని ప్రాజెక్ట్ వద్ద ములకలపల్లి మండలానికి చెందిన ఇద్దరు పాఠశాల విద్యార్థులు ఈతకు వెళ్లి నీటిలో గల్లంతై మృతి చెందారు.
- ఏడాది క్రితం కిన్నెరసాని ప్రాజెక్ట్ నుంచి కేటీపీఎస్ కర్మాగారానికి నీటిని సరఫరా జరిగే కాల్వలో సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు, తాగునీటి కోసం కాల్వలో దిగిన మరో ఇద్దరు.. మొత్తం ఐదురుగు చనిపోయారు.
- పాల్వంచ మండలం దంతలబోరు గ్రామానికి చెందిన నర్సిరెడ్డి పశువుల మేతకు వెళ్లి కిన్నెరసాని వాగులో చిక్కుకున్నాడు. స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి ప్రాణాలు కాపాడారు.
- దుమ్ముగూడెం మండలం సీతానగరం సమీపంలో గుబ్బలమంగి వాగులో ముగ్గురు యువకులు గల్లంతుకాగా, ఇద్దరిని స్థానికులు కాపాడారు. ఒకరు గల్లంతయ్యారు. రామవరానికి చెందిన ఖాజామొయినుద్దీన్ గతేడాది ముర్రేడు వాగులో పడి మృతి చెందగా, ములకలపల్లి మండలం వేముకుంట గ్రామం వద్ద మృతదేహం లభించింది.


అలుగుపోస్తున్న రాళ్లవాగు ప్రాజెక్ట్

జిల్లాలో మొత్తం చెరువులు :	2,364
అలుగుపోస్తున్నవి :	499
75శాతం నిండినవి :	757
50శాతం నిండినవి :	590
25శాతం నిండినవి :	312

నిండుతున్నాయి..



కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే వరద జలాలతో జిల్లాలోని కొన్ని చెరువులు, జలాశయాలు నిండి కళకళలాడుతున్నాయి. తాలిపేరు, కిన్నెరసాని ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటిని వదులుతున్నాం. వర్షం ప్రభావం ఇలాగే మరో రెండు రోజులు ఉంటే మొత్తం చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోసే అవకాశం ఉంది.

–శ్రీనివాసరెడ్డి, సీఈ జలవనరులశాఖ

విమర్శల హోరు!

- పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలు
- ప్రత్యర్థి పార్టీల వ్యాఖ్యలే బ్రహ్మాస్త్రాలుగా ముందుకు..
- ఢీ అంటే ఢీ అంటున్న బీఆర్ఎస్–కాంగ్రెస్
- ఆచితూచి స్పందిస్తున్న బీజేపీ, వామపక్షాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో రాజకీయ పార్టీల విమర్శల తుపాను ఉధృతమైంది. ఎన్నికల వేళ అందివచ్చిన అవకాశాలను ఒడిసి పట్టుకుని రాజకీయంగా అనుకూల పరిస్థితులను సృష్టించుకునేందుకు పార్టీలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాపై కన్నేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఈ దిశగా పావులు కదుపుతున్నాయి. ప్రత్యర్థి పార్టీలను ఇరుకున పెట్టేలా సవాళ్లు, ప్రతిసవాళ్లతో రెచ్చిపోతున్నాయి. సొంత పార్టీకి మైనస్ కాకుండా.. ప్రత్యర్థి పార్టీకి నష్టం కలిగించే వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల వేడి చల్లారకుండా బీఆర్ఎస్ ఆందోళనలు చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ కూడా కార్యక్రమాలను ముమ్మరం చేసింది.

బీఆర్ఎస్ భేరీనాదం..
జిల్లాలో బీఆర్ఎస్ నేతలు సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీగా సమాయత్తం అవుతున్నారు. రైతులకు 24 గటల విద్యుత్ సరఫరా అవసరం లేదంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ ఆందోళనకు దిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే అంశంపై బీఆర్ఎస్ విమర్శలు సంధించగా.. జిల్లాలోనూ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఇదే అంశంపై వరుస ఆందోళనలు, దిష్టిబొమ్మ దహనాలు చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 24 గంటల కరెంట్ ఇవ్వదంటూ విమర్శలు సంధిస్తున్నారు.

జోరు మీదున్న కాంగ్రెస్..
ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ కూడా జిల్లాలో జోరు పెంచింది. కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు నాయకులు సమాయత్తం అవుతున్నారు. వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా కావడం లేదనే అంశాన్ని రైతులకు అర్థమయ్యేలా పలు సందర్భాల్లో ఆందోళనలు నిర్వహించారు. మరోవైపు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో పర్యటిస్తూ బీఆర్ఎస్ హయాంలో ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన అనేక సమస్యలను భట్టి వివరిస్తుండగా.. పొంగులేటి నేరుగా బీఆర్ఎస్‌పైకి విమర్శలు ఎక్కుపెడుతున్నారు. సిట్టింగ్‌లందరికీ బీఫామ్‌లు ఇచ్చే దమ్ముందా అంటూ బీఆర్ఎస్ అధినేతకే పొంగులేటి సవాల్ విసిరారు. ఈ క్రమంలో ఈ రెండు పార్టీల మధ్య వచ్చే ఎన్నికల్లో హోరాహోరీ తప్పదనే చర్చ జరుగుతోంది.

ఎన్నికల వ్యూహాల్లో వామపక్షాలు..
జిల్లాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు సభలు, సమావేశాలతో హోరెత్తిస్తుండగా.. భారతీయ జనతాపార్టీ, సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా తదితర పార్టీలు మాత్రం ఆచితూచి స్పందిస్తున్నాయి. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో ప్రత్యర్థికి ఎటువంటి అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతో నాయకులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. సీపీఎం, సీపీఐ జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలు పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పటికీ.. సంచలన వ్యాఖ్యలకు మాత్రం దూరంగానే ఉంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఎన్నికల కురుక్షేత్రానికి పార్టీలను సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తూ కార్యోన్ముఖులను చేస్తున్నారు.

వేచిచూసే ధోరణిలో బీజేపీ..
బీజేపీ ప్రస్తుతం వేచి చూసే ధోరణి అవలంబిస్తోంది. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో సత్తా చాటాలని రాష్ట్ర, జాతీయ నాయకత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. గత నెల 15న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ సభ ఖమ్మంలో నిర్వహించాల్సి ఉండగా.. తుపాను కారణంగా వాయిదా పడింది. దీంతో ఆ పార్టీ శ్రేణులు కొంత నిరాశకు గురయ్యాయి. ఈ సభ ఈనెల 29న ఉంటుందనే ప్రచారం జరుగుతున్నా, అధికారికంగా ఖరారు కాలేదు. ఈ సభను విజయవంతం చేయడం ద్వారా బీజేపీ సత్తా చాటాలని పార్టీ జిల్లా నాయకత్వం భావిస్తోంది. ఆ తర్వాత ప్రత్యర్థి పార్టీలపై విమర్శనాస్త్రాలు సంధించాలని భావిస్తున్నట్లు సమాచారం. మరో రెండు, మూడు నెలల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలతోపాటు వామపక్షాలు, బీజేపీ, వైఎస్సార్‌టీపీ, బీఎస్పీ తదితర పార్టీలు కూడా ఎన్నికల కదన రంగంలో విమర్శలు, ప్రతి విమర్శలతో హోరెత్తించడానికి సిద్ధమయ్యే అవకాశం ఉంది.

ప్రజారోగ్యం పట్టదా?

- జూలై గడుస్తున్నా అందని దోమతెరలు
- వర్షాలకు ఏజెన్సీ గ్రామాలు, బస్తీల్లో దోమల వ్యాప్తి
- నిల్వ నీటితో పొంచి ఉన్న ప్రమాదం
- వైద్యశిబిరాలు నిర్వహించని పీహెచ్‌సీలు



పాత కొత్తగూడెంలో ఓ ఇంట్లో నిల్వఉన్న నీరు (ఇన్‌సెట్) జిల్లా కేంద్రంలోని ఓ వీధిలో పేరుకుపోయిన కొబ్బరి బొండాలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత మారుమూల గ్రామాలు, పట్టణాల్లోని మురికివాడల్లో దోమలు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. దీంతో వర్షాకాలంలో విష జ్వరాలు విజృంభిస్తాయి. ఈ నేపథ్యంలో దోమకాటును నుంచి రక్షించేందుకు రెండేళ్లకోసారి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే దోమతెరలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మారుమూల గ్రామాలు, హాస్టళ్లు, మురికివాడల్లో పంపిణీ చేస్తారు. కానీ ఈ ఏడాది ఇంకా దోమతెరలు జిల్లాకు చేరలేదు.

75 వేలు అవసరమని వైద్యశాఖ ప్రతిపాదనలు
జూన్ నెల చివరి నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నిల్వ నీటివల్ల దోమల వృద్ధి చెందుతున్నాయి. జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు దోమతెరలు లేకపోవడంతో గ్రామాలు, మురికివాడల్లో నివసించే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది జిల్లాకు 75 వేల వరకు దోమతెరలు అవసరమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ అవి వచ్చేసరికి వర్షాకాలం ముగిసే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి త్వరగా దోమతెరలను తెప్పించాలని పలువురు కోరుతున్నారు. ఇక ఫీవర్ సర్వే కూడా నామమాత్రంగానే సాగుతోంది.

కొన్ని పీహెచ్‌సీల్లో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఉన్నా...
ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఉన్న పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఎక్కువ సంఖ్యలో మెడికల్ క్యాంపులు నిర్వహించే అవకాశం ఉన్నా.. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. మెడికల్ క్యాంపులు నిర్వహించి ముందే అవగాహన కల్పిస్తే ప్రజలు జ్వరాల బారిన పడకుండా ఉండే అవకాశం ఉంటుంది. కాగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 20 మందితో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమల వృద్ధిని నివారించేందుకు చర్యలు చేపడుతోంది.

నీరు, ఆహారంపై శ్రద్ధ
వర్షాకాలంలో నీరు, ఆహారం కలుషితం ఎక్కువగా జరుగుతుంది. దీనివల్ల సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. వర్షాలతో కొత్త నీరు చేరుతుంది. ఆ నీటిని అలాగే తాగడంతో ఆరోగ్య సమస్యలు వస్తాయని, వర్షాకాలంలో వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. జ్వరం వచ్చిన వారు కొందరు అవగాహన లేక హైడోస్ యాంటిబయాటిక్ ఇంజెక్షన్లు, మందులు వాడుతున్నారని, వీటి వల్ల ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోతుందని పేర్కొంటున్నారు. ఫలితంగా మరింత అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

ముందే వైద్యశిబిరాలు నిర్వహిస్తే మేలు
జిల్లాలో మారుమూల ప్రాంతాలు, మురికివాడలు ఎక్కువ సంఖ్యలో ఉన్న నేపథ్యంలో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది. ఇందుకోసం జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీ పరిధిలో వారంలో మూడు రోజులు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం, నీరు వంటి విషయాలను వివరించాలని పలువురు పేర్కొంటున్నారు. విషజ్వరాలు ఉన్న వారికి మందులు ఇవ్వడం, అనారోగ్యంగా, నీరసం ఉన్న వారికి గ్లూకోజ్‌లు పెట్టడం వంటివి చేయాల్సిఉంది. కానీ విషజ్వరాలు ప్రబలడం, హైరిస్క్ కేసులు నమోదు కావడం, విషజ్వరాలతో మృతి చెందడం వంటి ఘటనలు జరిగితేనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు.

మలేరియా, డెంగీ కేసుల వివరాలు ఇలా..
జిల్లాలో గతేడాది జూలై వరకు 12,531 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా, 21 మందికి మలేరియా, 18 మందికి డెంగీ నిర్ధారణ అయింది. ఈ ఏడాది ఇప్పటివరకు 8,895 మందికి రక్త పరీక్షలు చేయగా, 12 మలేరియా, 12 డెంగీ కేసులు నమోదయ్యాయని వైద్యాధికారులు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మలేరియా, డెంగీ కేసులు తక్కువగానే నమోదయ్యాయి.

సమ్మెతో గ్రామాల్లో కొరవడిన పారిశుద్ధ్యం
తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మె చేపడుతున్నారు. విధులు బహిష్కరించి 18 రోజుల నుంచి ఆందోళనలు నిర్వహిస్తున్నారు. దీంతో పల్లెల్లో చెత్త సేకరణ, డంప్ యార్డులకు తరలింపు నిలిచిపోయింది. దీంతో వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తోంది. ఎడతెరిపిలేని వర్షాలకు చెత్తాచెదారం తడిసి కంపు కొడుతోంది. దోమలు వ్యాపిస్తుండటంతో జ్వరాలు విజృంభిస్తాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మలేరియా, డెంగీ కేసులు నమోదు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నాం. అధికారులకు, సిబ్బందికి సూచనలు చేస్తున్నాం. రిస్క్ ఉన్న ఏరియాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నాం. మందులు పంపిణీ చేస్తున్నాం.

–శిరీష, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి



భద్రాచలం: శ్రీసీతారామచంద్ర స్వామివారికి ఆదివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. అనంతరం కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఆదివారం సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

చర్లలో ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాలతో పాటు చర్ల, వెంకటాపురం మండలాల్లోని అటవీ ప్రాంత గ్రామాలకు చెందిన ఆదివాసీలు పెద్దఎత్తున తరలివస్తారు. వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, లక్ష్మీకాలనీ, తాలిపేరు ప్రాజెక్ట్, ఆర్.కొత్తగూడెం, కలివేరు క్రాస్ రోడ్‌లలో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు వచ్చి పోయే ఆదివాసీలను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు వారి వద్ద ఉన్న బ్యాగులను పరిశీలించారు.

నేడు తాలిపేరు నుంచి సాగునీరు విడుదల

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్ నుంచి ప్రధాన ఎడమ, కుడి కాలువల ద్వారా వానాకాలం పంటలకు సాగునీరు విడుదల చేయనున్నట్లు ప్రాజెక్ట్ డీఈ తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, ఎంపీపీ కోదండరామయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంతతో పాటు స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల చేతుల మీదుగా లాంఛనంగా గేట్లు ఎత్తి సాగునీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాలిపేరుకు కొనసాగుతున్న వరద



తాలిపేరు నుంచి విడుదలవుతున్న నీరు

చర్ల: తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్ట్‌కు వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వారం రోజులుగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం కూడా ప్రాజెక్ట్‌కు చెందిన 25 క్రస్టు గేట్లలో 12 గేట్లను 4 అడుగుల మేర ఎత్తి 27,541 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి 28,240 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకొని నీటిమట్టాన్ని 72.50 మీటర్లుగా కొనసాగిస్తున్నారు. ఎగువ నుంచి మరో రెండు మూడు రోజుల పాటు వరదనీరు వచ్చే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

కిన్నెరసానిలో సందడి



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసానికి ఆదివారం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు డీర్ పార్కులోని దుప్పులు, డ్యాం పైనుంచి జలాశయాన్ని వీక్షించి ఉల్లాసంగా గడిపారు. 746 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్‌కు రూ.29,985.. 270 మంది బోటింగ్ చేయడం ద్వారా రూ.16,730 ఆదాయం టూరిజం శాఖకు లభించిందని నిర్వాహకులు తెలిపారు.

గంజాయి స్వాధీనం



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

భద్రాచలంటౌన్: అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లోని ఎక్సైజ్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఓ ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా 13.5 కేజీల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించంగా గంజాయిని ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తేలిందని సీఐ వెల్లడించారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, వాహనాన్ని సీజ్ చేశామని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ గణేశ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, సీఐ రహీమున్నీసాబేగం, ముబాశిర్ అహ్మద్, సందీప్, రతన్‌రెడ్డి పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

సేవలు సరళతరం..

- ప్రభుత్వాస్పత్రి ఓపీ స్లిప్పులపై క్యూ ఆర్ కోడ్
- ఎక్కడికి వెళ్లినా తెలిసేలా ఆన్‌లైన్‌లో నమోదు
- ఉమ్మడి జిల్లాలోని 12 ఆస్పత్రుల్లో అమల్లోకి..



ప్రిస్క్రిప్షన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వైద్యుడు, (ఇన్‌సెట్) క్యూ ఆర్ కోడ్‌తో ఉన్న ఓపీ చిట్టీ

సత్తుపల్లిటౌన్: సర్కారు ఆస్పత్రులకు పేషెంట్లు తక్కువగా వచ్చినా.. ఎక్కువ సంఖ్యలో వచ్చినట్లు చూపించే పద్ధతికి స్వస్తి పలుకుతూ.. ఓపీ సేవల్లో ప్రభుత్వం పారదర్శకతను పెంచింది. వైద్యులు కూడా మొక్కుబడి సేవలకు పరిమితం కాకుండా నాణ్యమైన వైద్యం అందించేలా వారి పనితీరును పర్యవేక్షించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచింది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఏ వైద్యుడి దగ్గర ఏ ట్రీట్‌మెంట్ తీసుకున్నారో తెలియనుంది.

కార్పొరేట్‌కు దీటుగా..

ప్రజారోగ్య సేవలను మరింత సరళతరం చేసేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటోంది. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య విధాన పరిషత్‌లోని ప్రభుత్వ ఏరియా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఔట్ పేషెంట్ల చిట్టీ (కార్డు)లకు క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. తొలుత ఏరియా ఆస్పత్రుల్లో ఈ నూతన పద్ధతిని అమలు చేయడం ఆరంభించారు.

ఏం చేస్తారంటే..

ఓపీ చిట్టీకి ప్రత్యేక కోడ్ నంబర్‌ను కేటాయించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రోగులకు సంబంధించిన బయోడేటా, రోగనిర్ధారణ, ట్రీట్‌మెంట్, వాడే మందుల వివరాలన్నీ టీఎస్‌ఈఎంఐఎస్ డేటాస్టోర్‌కు వెళ్తాయి. కంప్యూటర్‌లో పేరు, వివరాలు నమోదు చేసి ప్రింటెడ్ చిట్టీ ఇస్తారు. దీనిని తీసుకొని డాక్టర్ వద్దకు వెళ్లగానే చిట్టీపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను తన మొబైల్‌తో టీఎస్‌ఈహెచ్‌ఎంఐఎస్ (తెలంగాణ స్టేట్ ఎలక్ట్రానిక్ హెల్త్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం)కి అనుసంధానం చేస్తారు. రోగికి ఏమైనా రక్త, ఎక్స్‌రే ఇతర పరీక్షలు అవసరమైతే చేయించి.. ఆ పరీక్షల ఫలితాల వివరాల ఆధారంగా మందులు రాస్తారు. రాసిన మందుల ప్రిస్క్రిప్షన్‌ను కూడా ఫోన్‌లో ఫొటో తీసి టీఎస్‌ఈహెచ్‌ఎంఐఎస్‌కి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇలా ప్రతీ వైద్యుడు పేషెంట్ల ఓపీ చిట్టీలతో అందించిన వైద్య సేవలను ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయడం వల్ల చిట్టీ నంబర్ చెప్పగానే టీఎస్‌ఈహెచ్‌ఎంఐఎస్ యాప్‌లో రోగి పొందిన వైద్య సేవలు కనిపిస్తాయి. ఇలా ఎక్కడ ఏరియా ఆస్పత్రికి వెళ్లినా గతంలో తాను పొందిన వైద్య సేవల మందుల చిట్టీ లేకపోయినా.. నంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే వివరాలు తెలిసేలా ఆధునీకరించారు.

జిల్లా ఆస్పత్రులతో పాటు..

ఖమ్మం, కొత్తగూడెం జిల్లా ఆస్పత్రులతో పాటు మెడికల్ కళాశాలలు, సత్తుపల్లి, మధిర, మణుగూరు, భద్రాచలం ఏరియా ఆస్పత్రులు, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కల్లూరు, పెనుబల్లి, అశ్వారావుపేట, పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నాయి. వీటిలో జిల్లా ఆస్పత్రులతో పాటు ఏరియా ఆస్పత్రుల్లో ఈ ఆధునిక సేవలను ప్రస్తుతం అమలు చేస్తున్నారు. కాగా ఓపీ చిట్టీలను కంప్యూటర్‌లో నమోదు చేసేదుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను మాత్రం నియమించకపోవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

వైద్య సేవలు పారదర్శకంగా..



ఏరియా ఆస్పత్రుల్లో ఆధునిక పద్ధతిలో కార్పొరేట్‌కి ధీటుగా వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఓపీ సేవలను కంప్యూటరీకరించింది. అన్ని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఈ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. నాణ్యమైన వైద్యం అందుతుండడంతో పాటు వైద్య సేవలపై పారదర్శకత పెరుగుతుంది.

– కె.వెంకటేశ్వర్లు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, సత్తుపల్లి

కడవరకూ కలిసే..

- గుండెపోటుతో భార్య.. రైలు ఢీకొని భర్త..
- ఒకరోజు తేడాతో దంపతుల దుర్మరణం



వన్నావరపు అలివేలు (ఫైల్)



వన్నావరపు కృష్ణ (ఫైల్)

వైరారూరల్: నిండునూరేళ్లు కలిసి ఉండాల్సిన దంపతులు ఒకరోజు వ్యవధిలో మృతిచెందగా, ఇద్దరికీ కలిపి ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన వైరా మండలం గన్నవరంలో విషాదం నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకానం.. గ్రామానికి చెందిన వన్నావరపు అలివేలు (50) శుక్రవారం ఇంటి పెరడులో పిచ్చి మొక్కలు తొలగిస్తూ గుండెపోటుకు గురై మృతిచెందింది. కాగా, గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో ఉంటున్న తమ బంధువు దశదిన కర్మ కోసం సోదరుడు శ్రీనివాసరావు, బాబాయి కుమారుడు వెంకటేశ్వరరావుతో కలిసి అలివేలు భర్త కృష్ణ (55) గురువారం బయలుదేరాడు. వారు సూరత్ చేరుకోకముందే అలివేలు మరణవార్త తెలిసి కృష్ణ, ఇద్దరు సోదరులు తిరుగుపయనమయ్యారు. నవజీవన్ రైలులో తిరిగి వస్తూ కృష్ణ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో రైలు మహబూబాబాద్ స్టేషన్‌లో ఆగగా, సోదరులకు తెలియకుండానే రైలు దిగాడు. ప్లాట్‌ఫాం వైపు కాకుండా మరో వైపు నుంచి దిగి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ఎల్‌సీ గేట్ 80 సమీపంలో వెనుకనుంచి వస్తున్న దాణాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య మృతితో మనోవేదన కారణంగానే ఈ ఘటన జరిగిందని భావిస్తూ డోర్నకల్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణ మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్ట్‌మార్టం చేశారు. ఈ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. దంపతులిద్దరి మృతదేహాలకు ఆదివారం ఒకేసారి గన్నవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. దంపతుల మృతితో కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులంతా కన్నీరుమున్నీరుగా విలపించారు.

టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారకుడై న టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదైంది. ఎస్‌ఐ జి.రమణారెడ్డి ఆదివారం వివరాలు వెల్లడించారు. మద్దిరాలతండాకి చెందిన గంగావత్ రాములు (46) శనివారం సాయంత్రం టేకులపల్లికి వచ్చి స్వగ్రామానికి వెళ్తున్నాడు. దాసుతండా సమీపంలో టిప్పర్ ఆగి ఉండటం కారణంగా రాములు ఢీకొని మృతిచెందాడు. రోడ్డుపై నిర్లక్ష్యంగా టిప్పర్ నిలిపి ఉంచడం వల్లనే తన తండ్రి మృతిచెందాడని కుమారుడు శ్యామ్‌లాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల వ్యాన్ సామగ్రి చోరీ

బూర్గంపాడు: సారపాకలో కన్నెదారి రమేశ్‌కు చెందిన కోళ్ల వ్యానులోని సామగ్రి శనివారం రాత్రి చోరీకి గు రైంది. ఆదివారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రమేశ్‌కు చెందిన కోళ్ల వ్యానును శనివా రం రాత్రి సారపాక ఆర్చి వద్ద పార్కింగ్ చేశాడు. గుర్తు తెలియని దొంగలు వ్యాను బ్యాటరీ, ఫ్రిజ్, జాకీలను అపహరించారు. వీటి విలువ రూ.78 వేల వరకు ఉంటుందని బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదనపు ఎస్‌ఐ యేసోబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వీరబాబు మృతదేహం

పాల్వంచ: కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేసే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేసే వీసారపు వీరబాబు(54) ఆదివారం కళాశాల ఆవరణలోని మోటార్ స్విచ్ వేసేందుకు వెళ్లి అక్కడే అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. కొద్ది సేపటి తర్వాత గుర్తించిన సిబ్బంది అతడిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కాగా, అతను ఫిట్స్ వచ్చి బురద నీటిలో పడి మృతిచెందాడని పలువురు చెబుతున్నారు. కానీ, మోటార్ స్విచ్ వేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అతని మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఎస్‌ఐ నాగభిక్షం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య

ప్రియుడు, అతడి తల్లిదండ్రుల వేధింపులే కారణమని మృతురాలి తల్లి ఫిర్యాదు



ఆకాంక్ష (ఫైల్)

చర్ల: గిరిజన యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. సీఐ అశోక్ కథనం ప్రకారం.. ఉంజుపల్లికి చెందిన పాయం భూదేవి భర్త మరణానంతరం చర్లలోని గొల్లగట్టలో నివాసముంటోంది. ఆమె రెండో కుమార్తె పాయం ఆకాంక్ష (21) హైదరాబాద్‌లో బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. కాగా, చర్లకు చెందిన దొడ్డా పృథ్వీరాజు, ఆకాంక్ష కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పృథ్వీరాజ్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేందుకు హైదరాబాద్‌కు వెళ్లాడు. తిరిగి రాగానే ఆకాంక్ష, పృథ్వీరాజు కలిసి చర్లలో ఇంటిని అద్దెకు తీసుకొని కాపురం పెట్టారు. కాగా, పాయం భూదేవి నెల రోజుల కిందట వారి వద్దకు వెళ్లి ఆకాంక్షను ఇంటికి రావాలని కోరినా ఆమె నిరాకరించింది. శనివారం సాయంత్రం పృథ్వీరాజు ఇంట్లో లేని సమయంలో ఆకాంక్ష కలుపుమందు తాగింది. దీంతో పృథ్వీరాజుతో పాటు అతడి తల్లిదండ్రులు ఆమెను భద్రాచలంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందింది. అయితే, చికిత్స పొందుతున్న సమయంలో తన కుమార్తెతో తాను మాట్లాడానని, భర్త, అత్తమామలు వేధిస్తున్నారని, అందువల్లే కలుపుమందు తాగానని చెప్పినట్లు తల్లి భూదేవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆకాంక్ష మృతదేహానికి పృథ్వీరాజు కుటుంబ సభ్యులే అంత్యక్రియలు నిర్వహించారు.

పురుగుమందు తాగి యువకుడు...



భూక్యా రమేశ్ (ఫైల్)

పాల్వంచరూరల్: కుటుంబ కలహాల కారణంగా యువకుడు పురుగుమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన భూక్యా రమేశ్ (28) తోగ్గూడెం వద్ద మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో పాల్వంచ బస్టాండ్ వద్ద పడిపోగా స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. పాల్వంచ పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని పురుగు మందుల దుకాణంలో ఓ వ్యక్తి పురుగుమందు డబ్బా కొనుగోలు చేసి రమేశ్‌కు ఇచ్చినట్లు సమాచారం.

శ్రీకనకదుర్గమ్మ తల్లికి విశేష పూజలు



పెద్దమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ తల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పెద్దమ్మతల్లి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తలనీలాలు సమర్పించారు. ఒడి బియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం జరిపారు. ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింత నాగరాజు, కిలారు నాగేమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..



బీసీ గురుకులంలో టీచర్‌ను ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు

టేకులపల్లి: మండలం కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులంలోని సమస్యలు పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరారు. ఆదివారం తమ పిల్లలను చూసేందుకు జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు గురుకులంలో సమస్యలను విలేకరులకు వివరించారు. మెనూ ప్రకారం మటన్ పెట్టాల్సి ఉండగా దోసకాయ కూర పెట్టారని, మెనూ సరిగా పాటించడం లేదని, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని, దుర్వాసన వస్తున్నాయని, సరిపడా ఫ్యాన్లు లేవని, ఆవరణలో పిచ్చి మొక్కలు, బురదగుంటలు ఉండటం వల్ల భవనంలోకి పాములు కూడా వస్తున్నాయని తెలిపారు. ఈ విషయమై గురుకులం ప్రిన్సిపాల్ చైతన్యను వివరణ కోరగా వర్షాల కారణంగా మటన్ పెట్టలేదని, ఫ్యాన్లు తెప్పిస్తున్నామని, స్నానాల కోసం ట్యాప్ పనులు జరుగుతున్నాయని, ఆవరణలో ఓసీ మట్టి పోయిస్తున్నామని, ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటిస్తున్నామని, మెనూ పాటిస్తున్నామని సమాధానం చెప్పారు.

ప్రత్యేకాధికారుల నియామకం

సూపర్‌బజార్(కొత్తగూడెం): గోదావరి ప్రభావిత పరివాహక మండలాల్లో వరద సహాయక చర్యలు, చేపట్టాల్సిన రక్షణ చర్యల పర్యవేక్షణకు ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌ను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఆదివారం తెలిపారు. ముంపు ప్రాంతాలైన చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాల్లో సహాయ చర్యల పర్యవేక్షణకు సెక్టోరియల్ అధికారులను, మండల ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విధులు కేటాయించిన సెక్టోరియల్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ఆయా మండలాల అధికారులను సమన్వయం చేస్తూ ముందుకు సాగాలని ఆదేశించారు. వరదలు, నిరంతర వర్షాల వల్ల దెబ్బతిన్న ఇళ్లు, పంటలు, పశువుల గణన చేపట్టాలని ఆదేశించారు. సెక్టోరియల్, మండల ప్రత్యేక అధికారుల వివరాలిలా ఉన్నాయి.


సెక్టోరియల్ అధికారుల వివరాలు

మండలం	స్పెషల్ ఆఫీసర్ పేరు	ఫోన్ నంబర్
అశ్వాపురం	బి.తాతారావు మణుగూరు ఏడీఏ(అగ్రికల్చర్)	7288894214
భద్రాచలం	ఎన్.శ్రీనివాసరావు(ఆర్‌డబ్ల్యూఎస్) డిప్యూటీ ఈఈ, భద్రాచలం	7995660289
బూర్గంపాడు	ఎస్.రాములు (టీడబ్ల్యూ) డిప్యూటీ ఈఈ, పాల్వంచ	9640228095
చర్ల	బి.సుధాకర్‌రావు (అగ్రికల్చర్) ఏడీఏ, భద్రాచలం	7288894215
దుమ్ముగూడెం	తాటి నాగేశ్వరరావు(ఇరిగేషన్) ఈఈ, దుమ్ముగూడెం సబ్ డివిజన్–2	9701362548
మణుగూరు	జి.బ్రహ్మదేవ్ (ఆర్‌డబ్ల్యూఎస్) డిప్యూటీ ఈఈ, మణుగూరు	9100120989
పినపాక	నాగమల్లేశ్వరరావు (ఐబీ) డిప్యూటీ ఈఈ, మణుగూరు	9701362549

మండలాల వారీగా స్పెషల్ ఆఫీసర్ల వివరాలు

మండలం	స్పెషల్ ఆఫీసర్	ఫోన్ నంబర్
ఆళ్లపల్లి	వెంకటేశ్వరరెడ్డి జిల్లా ఆడిట్ ఆఫీసర్	9441212780
అన్నపురెడ్డిపల్లి	డి.అనసూర్య జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్	9949194110
అశ్వాపురం	ఎస్.వెంకటేశ్వర్లు (డీసీఓ)	9100115679
అశ్వారావుపేట	కె.స్వర్ణలత (ఆర్‌డీఓ) కొత్తగూడెం	9392919715
భద్రాచలం	బి.నాగలక్ష్మి(జెడ్పీపీ) డిప్యూటీ సీఈఓ	7330642829
బూర్గంపాడు	తిరుమలేశ్(ఆర్‌డబ్ల్యూఎస్) ఈఈ	9100122281
చంద్రుగొండ	సంజీవరావు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్	7993357078
చర్ల	కొర్స అభిమన్యుడు జిల్లా వ్యవసాయాధికారి	7288894268
చుంచుపల్లి	ఎం.విద్యాలత (జెడ్పీ సీఈఓ)	8790835540
దమ్మపేట	జైపాల్‌రెడ్డి (ఎంపీఐ)	984852834
దుమ్ముగూడెం	బి.సులోచనారాణి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి	7997994366
గుండాల	బి.వీరన్న(జిల్లా మత్స్యశాఖాధికారి)	8555840789
జూలూరుపాడు	బి.భీమ్లా (ఆర్‌అండ్‌బీ ఈఈ)	9440818086
కరకగూడెం	జైసింగ్ (ఏడీ మైన్స్)	9440005525
లక్ష్మీదేవిపల్లి	కె.మనోహర్ (డీఎల్‌ఎంఓ)	9849128458
మణుగూరు	శ్రీనివాస్ (జిల్లా ఫైర్ ఆఫీసర్)	9381094471
ములకలపల్లి	ఎం.బాలు జిల్లా భూగర్భజల శాఖాధికారి	7032982035
పాల్వంచ	టి.సీతారాంనాయక్ జిల్లా పరిశ్రమల శాఖాధికారి	9502875115
పినపాక	హెచ్‌వీ రాంప్రసాద్ ఈఈ, ఇరిగేషన్ డివిజన్–5,భద్రాచలం	9490563212
సుజాతనగర్	ఎస్.త్రినాథ్‌బాబు (డీఎస్‌ఓ)	7995050728
టేకులపల్లి	వి.విజేత(జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్)	7032705979
ఇల్లందు	జినుగు మరియన్న జిల్లా ఉద్యాన శాఖాధికారి	7997725142
కొత్తగూడెం	అర్జున్ (జిల్లా ఇరిగేషన్ ఆఫీసర్)	9701362542

గుమ్మడి నర్సయ్యపై ఫిర్యాదు



గుమ్మడి నర్సయ్యపై ఫిర్యాదు చేస్తున్న ఏఎస్పీ నాయకులు

దుమ్ముగూడెం: ఆదివాసీ చట్టాలను, హక్కులను కాలరాసే విధంగా మాట్లాడిన ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యపై కేసు నమోదు చేయాలని ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఇల్లెందులో గిరిజనేతరులు నిర్వహించిన కార్యక్రమానికి వెళ్లి వారికి మద్దతు ప్రకటించారన్నారు. ఆదివాసీ హక్కులు, చట్టాలకు భంగం కలిగే విధంగా మాట్లాడిన గుమ్మడి నరసయ్యపై చట్టపరంగా కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో కురసం మహేశ్, తాటి బన్నీ తదితరులు పాల్గొన్నారు.